

హరిదాసుల వేషధారణలో ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో సందడి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, మేయర్ కావటి మనోహర్



వీణపై క్యూఆర్ కోడ్‌తో ఆకట్టుకున్న ఆధునిక హరిదాసు

ఆనందోత్సాహాలతో భోగి సంబరాలు

వాడవాడలా భోగిమంటల సందడి



భోగి మంట వెలిగిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా

పాత గుంటూరు: గుంటూరులో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. డూడూ బసవన్నలు.. భోగి మంటల వెలుగుల్లో పండగ సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యువత ఆనందోత్సాహాల నడుమ.. వెలుగు రేఖలు నింపే భోగి మంటల్ని తెల్లవారుజామునే వేశారు. పిడకల దండలు మంటల్లో వేసి భక్తిశ్రద్ధలతో సంక్రాంతికి స్వాగతం పలికారు. మహిళలు తమ ఇళ్ల ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. దుకాణాల యజమానులు భోగిమంటలు వేశారు. నగరంలోని అన్ని వీధుల్లో భోగిమంటల సందడి కనిపించింది. హరిదాసుల సందడితో తెల్లవారింది. యువత గాలిపటాలతో సందడి చేశారు. భోగి సంబరాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలకు నెలవు సంక్రాంతి..

నెహ్రూనగర్: కుల, మతాలకు అతీతంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి పండుగ అని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాల్లో ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పాల్గొని భోగి మంటలు వేశారు. అనంతరం గంగిరెద్దుల విన్యాసాలు, వివిధ కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరువాడా ఒక్కటై, బంధుమిత్రులు ఏకమై సంబరంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి అని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మార్కెట్ శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు...

లక్ష్మీపురం: తెలుగు సంస్కృతికి ప్రతిబింబం సంక్రాంతి అని సంక్రాంతి పేరుతో భారతీయ సంస్కృతి మన హృదయాల్లోకి ప్రసరించి జ్యోతిర్మయం చేస్తుందని విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ సూర్యుడు ఉత్తర దిశగా పయనాన్ని ప్రారంభించే సమయం ఉత్తరాయణ పుణ్యకాలమని ఇది పుష్య మాసంలో వస్తుందన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి చలికాలం అంటే హేమంత కాలంలో వస్తుందన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత సంస్కృత అధ్యాపకులు సుబ్రహ్మణ్య శాస్త్రి, పక్కన సంస్థ సభ్యులు

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం



కృష్ణనగర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



రామనామక్షేత్రంలో కల్యాణం

పాత గుంటూరు: నగరంలోని పలు వైష్ణవాలయాలలో విశేష పుష్పాలంకరణలతో, ప్రత్యేక పూజలతో గోదా రంగనాథులస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వేత్తలు కల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణమూర్తులకు విశేష హారతి, భక్తులకు కల్యాణ అక్షింతలు, తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ జరిగింది.

డీవైఎఫ్‌ఐ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అప్పారావు, కృష్ణకాంత్, సమీర్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అందరికీ విద్య, ఉపాధి కోసం ఆవిర్భవించిన డీవైఎఫ్‌ఐ ఆయా అంశాలపై నిరంతర కృషి చేస్తోందని సంఘ మాజీ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని భారత ప్రజాతంత్ర సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు, ఉద్యమాలతో సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని తెలిపారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని కోరుతూ చైతన్యవంతమైన కార్యక్రమాలతో పాటు యువతలో సామాజిక స్పృహ, దేశభక్తిని పెంపొందించేందుకు బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్కే బాషా, ఎస్. కార్తీక్, ఎం.కిరణ్ కబీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సమీర్ పాల్గొన్నారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న పసులేటి శివ

పొన్నూరు: అయోధ్యరాముని అక్షంతలు, స్వర్శ పంపిణీ కార్యక్రమం శ్రీరామ మందిరం ధర్మకర్తలు చైర్మన్ పసులేటి శివ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పొన్నూరు, నిడుబ్రోలులో అక్షంతల కలశంతో ప్రధాన వీధుల్లో శోభాయాత్ర శ్రీరామ నామస్మరణతో జరిగింది. భక్తులు కలశాన్ని తమ తలపై ధరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ దినం భారతీయులందరికీ పండుగ రోజు అని, ప్రతిష్ఠ ఆహ్వానం, రాములవారి అక్షంత ప్రసాదాన్ని పట్టణంలో ప్రతి కుటుంబానికి చేరుస్తున్నామని శివ తెలిపారు. వివిధ ప్రాంతాల ప్రజలు అందరి ఇళ్లకు చేర్చేందుకు అక్షింతలను తీసుకుని వెళ్లారు. ఆవుల సంఘం చలపతిరావు, బండారు శ్రీను, బావిరెడ్డి బ్రహ్మం, బావిరెడ్డి సుబ్బారావు, గద్దే రత్తయ్య, దాసరి రమేష్, తాడిశెట్టి గోపీరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులోని సినిమాహాలు ప్రాంతం వద్ద ఆదివారం జరిగింది. పొన్నూరు రూరల్ మండలం బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన యువకులు ఎ.అనీల్, కె.అనీల్, జయవర్ధన్‌లు ద్విచక్ర వాహనంపై చేబ్రోలుకు బయలు దేరారు. మార్గమధ్యలో చేబ్రోలు సినిమా హాలు సమీపంలో పొన్నూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈఘటనలో ముగ్గురు యువకులకు కాళ్లు విరగటంతో పాటు, తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా నిత్య సహాయమాత మహోత్సవం



నిత్య సహాయమాత మహోత్సవంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: నిత్య సహాయమాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అంది ప్రజలంతా సంతోషంగా జీవించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం నల్లపాడు గ్రామంలోని నిత్యసహాయమాత ఆలయ పండుగ మహోత్సవానికి సమన్వయకర్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిత్య సహాయ మాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బలసాని మాట్లాడుతూ ప్రజలంతా నూతన సంవత్సరంలో సంతోషంగా ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. నిత్య సహాయమాత చర్చిలో ఇలా పండుగ మహోత్సవాలు జరుపుకోవటం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజలంతా సమష్టిగా ఏర్పడి పండుగను జరుపుకోవటం బాగుందని సంఘ పెద్దలను అభినందించారు. సంఘ పెద్దలు బలసానిని ఘనంగా శాలువాలు కప్పి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ నల్లపాడు డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నడవ వీరయ్య, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి పాల్గొన్నారు.

• సంక్రాంతి సంబరాలు జబర్దస్త్



అలరించిన నృత్యప్రదర్శన



శాంతిస్వరూప్ జబర్దస్త్ బృందం కామెడీ షో



ఆకట్టుకున్న జబర్దస్త్ ఇమ్మానియేల్ ఆనందోబ్రహ్మ కామెడీ షో

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో ఆదివారం రాత్రి జబర్దస్త్ బృంద సభ్యులు సందడి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి చిన్నారులు కూచిపూడి, భరత నాట్యాలు, జుంబా డ్యాన్స్‌తో ప్రజలను అలరించారు. అనంతరం జబర్దస్త్ ఇమ్మానియేల్ చేసిన ఆనందో బ్రహ్మ కామెడీషో, వెంకీ మంకీ టాకింగ్ డాల్, ఆనంద్ చే మిమిక్రీ, హాస్యవల్లరి, శాంతి స్వరూప్ ఆట పాట కామెడీ టానిక్ వంటి కార్యక్రమాలు నగరవాసులను ఆకట్టుకున్నాయి.

– నెహ్రూనగర్

భక్తిశ్రద్ధలతో కర్పూర జ్యోతి దర్శనం

పెదకాకాని: హరిహరసుతుడు అయ్యప్పస్వామికి భక్తులు అభిషేక పూజలు, కర్పూర హారతులు అందించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం భోగి పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం, శబరిమల అయ్యప్పస్వామి సన్నిధిలో మకరజ్యోతి దర్శనం సందర్భంగా స్వామివారికి అభిషేక పూజలు చేశారు. గుంటూరుకు చెందిన పద్మజ జ్యూయలర్స్ యజమాని భూషా చంద్రారెడ్డి స్వామివారి అలంకరణకు ఆభరణాలు తయారు చేయించి సమర్పించటంతో పాటు ప్రతి ఏటా 21 కిలోల కర్పూరాన్ని అందజేస్తున్నారు. ప్రతి ఏటా స్వామి వారికి అలంకరించే ఆభరణాలు, మకర జ్యోతిగా వెలిగించే కర్పూరాలను తీసుకుని మాకిరెడ్డి వెంకటరెడ్డి గురుస్వామి ఇంటి నుంచి మేళతాళాలతో గ్రామోత్సవంగా బయలుదేరి ఆలయానికి చేరుకుంటారు. గురుస్వామి పర్యవేక్షణలో సాయంత్రం ఆభరణాలతో పాటు ఆలయంలో హారతులు, కర్పూర జ్యోతి వెలిగించేందుకు దాతలు అందజేసిన కర్పూరం, దీపాలతో ఆలయానికి చేరుకున్నారు. అర్చకస్వామి శక్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్పస్వామి వారి 18మెట్లకు పూజలు చేసి కర్పూర జ్యోతిని వెలిగించారు.

అ'పూర్వ' కలయిక

19 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు



నాటి, నేటి గురువులతో 2004- 05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పెదనందిపాడు: పాఠశాల పూర్వ స్నేహితులంతా ఒక్కచోట చేరారు. ఆ సంతోషం, ఆ ఉద్వేగం.. చెప్పతరమా అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం ఉదయం మండల పరిధిలోని అన్నపర్రు కేఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. పాఠశాలలో 2004–05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఒక్కచోట సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ అభ్యున్నతికి మార్గం చూపిన గురువులు బి.సత్యం, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణకుమారి, ఉమామహేశ్వరిలను వారంతా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులను, దివ్యాంగులను ఆదరించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామడి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, పది రకాల నిత్యావసర వస్తువుల కిట్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అనేక మంది వృద్ధులు ఎటువంటి ఆదరణ లేక జీవిస్తున్నారని, అటువంటి వారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు నేరెళ్ల కొండలరావు, ఇస్కాన్ దేవాలయం ప్రతినిధి వీరగోవింద ప్రభూజీ, సభ్యులు మాదాల ప్రకాష్, పలకలూరి శివరావు, పోలేపల్లి వెంకటసుబ్రమణ్యం, ఎస్‌వీ రమణ, టి.మురళీసాయి, అరుణకుమారి, పోలేపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని అహల్య ట్రస్టు సెక్రటరీ డాక్టర్ శనక్కాయల రాజకుమారి చెప్పారు. ఆదివారం స్థానిక నల్లచెరువులో ఉచిత వైద్య శిబిరం జరిగింది. వైద్య శిబిరంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్, స్పెర్మ్ కౌంట్, రక్త పరీక్షలు, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి సుమారు 600 మందికి మందులు సైతం అందజేశారు. డిసెంబరు 25 నుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, సోమవారంతో వైద్య శిబిరాలు ముగుస్తాయన్నారు. గుంటూరు నగరంలోని ప్రతి వార్డులో ఇంటింటికి తిరిగి ఉచిత వైద్యశిబిరాల కరపత్రాలు అందజేసి ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ట్రస్టు ఆధ్వర్యంలో 20 రోజులుగా జరుగుతున్న వైద్య శిబిరాల్లో సుమారుగా ఐదు వేల మందికి వైద్య సేవలు అందించామన్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ పేదలకు సేవలందించాలనే లక్ష్యంతో 2013లో ట్రస్టు ప్రారంభించామన్నారు. ప్రతి ఏడాది ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలతోపాటు అన్నదానం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, స్కాలర్‌షిప్పుల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

పట్నంబజారు: భోగభాగ్యాలు, పాడిపంటలు, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఆయురారోగ్యాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు స్పందన తాత్కాలికంగా రద్దు

నెహ్రూనగర్: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సోమవారం సెలవు దినం కావడంతో నగరపాలక సంస్థలో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

ముగిసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శిబిరానికి విశేష ఆదరణ లభించిందని, సుమారు 100 మంది వరకు కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశామని తెలిపారు.